సాక్షి
అనంతపురం

శనివారం | 24 | మే | 2025



కుప్పకూలిన గాలిమర

పుట్లూరు మండలం ఎ.కొండాపురం సమీపంలో ఒక గాలిమర కుప్పకూలింది. జీహెచ్ఈఎల్ కంపెనీ 1999లో కొండపై 16 గాలిమరలు ఏర్పాటు చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 11న ఒక గాలిమర కూలింది. శుక్రవారం మరొకటి కూలిపోవడం అనుమానాలకు తావిస్తోంది. – పుట్లూరు

గరిష్టం/కనిష్టం
36.2°/23.4°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉక్కపోత తగ్గింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

అనంతపురం అర్బన్: యూపీఎస్సీ ఆధ్వర్యంలో ఈ నెల 25న నిర్వహించనున్న సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ శుక్రవారం తెలిపారు. కంట్రోల్ రూమ్ 24, 25 తేదీల్లో ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఏదైనా సమాచారం లేదా ఫిర్యాదు కోసం కంట్రోల్ రూమ్ నంబర్లు 85002 92992 (వాట్సాప్), 08554-220009ను సంప్రదించవచ్చని తెలిపారు.

చుక్కల భూములకు పరిష్కారం



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జేసీ శివ్ నారాయణ్ శర్మ


అనంతపురం అర్బన్: నిషేధిత జాబితాలో ఉన్న చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. అధికారులు కూడా ఆ దిశగా పనిచేయాలని చెప్పారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి కళ్యాణదుర్గం డివిజన్‌కు సంబంధించి డీఎల్‌సీ, డీఎల్ఎన్‌సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత జాబితాలో ఉన్న చుక్కల భూములను తొలగించేందుకు ప్రతి వారం షెడ్యూల్ ప్రకారం జిల్లా స్థాయి డాటెడ్ ల్యాండ్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నారు. కళ్యాణదుర్గం మండలానికి సంబంధించి ఒక కేసును విచారించి ఆమోదించామన్నారు. క్షేత్రస్థాయిలో తహసీల్దార్లతో ఆర్డీఓ పని చేయించాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సెక్షన్ వారీగా ఫైళ్లు ఎన్ని పంపారు. ఎన్ని పరిష్కరించారనేది తనిఖీ చేయాలని జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించారు. సమావేశంలో డీఆర్ఓ ఎ.మలోల, కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్ భాస్కర్, మునిసిపల్ కమిషనర్ వంశీకృష్ణ, కలెక్టరేట్ భూ విభాగం సూపరింటెండెంట్ రియాజుద్దీన్, డీటీ ప్రభంజన్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

అనంతపురం అర్బన్: చౌక ధరల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ అధికారులను ఆదేశించారు. పౌర సరఫరాల అంశాలపై జేసీ శుక్రవారం ఆ శాఖ అధికారులతో సమీక్షించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను తీవ్రంగా పరిగణించాలన్నారు. ఈ విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. రవాణా చేస్తున్న వారిపై 6ఏ కేసు నమోదు చేయాలన్నారు. ఇదే వృత్తిగా ఎంచుకుని అక్రమాలకు పాల్పడే వారిపై పీడీ చట్టం మేరకు కేసు పెట్టడంతో పాటు రౌడీ షీట్ తెరవాలని పోలీసు శాఖ అధికారులను ఆదేశించారు. చౌక ధరల దుకాణాలను తూనికలు కొలతల శాఖ అధికారులు నిరంతరం తనిఖీ చేయాలని చెప్పారు. చౌక దుకాణాలను ఆర్డీఓలు, తహసీల్దారులు, సీఎస్‌డీటీలు, డీఎస్ఓ తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. కార్డుదారుల ఈ-కేవైసీ పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని చెప్పారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

పగబట్టి.. పంపించేశారు

‘మా ప్రభుత్వం.. మాదే రాజ్యం.. ప్రశ్నించకూడదు.. ఎదురు చెప్పకూడదు’ అన్నట్లు టీడీపీ ప్రజాప్రతినిధులు, నేతలు వ్యవహరిస్తున్నారు. వంగి వంగి దండాలు పెడితే సరి.. లేకపోతే దండనకు సిద్ధంగా ఉండాలంటూ హెచ్చరికలు పంపుతున్నారు. తప్పు చేయకపోయినా కుట్ర చేసి మరీ బదిలీ బహుమానంగా ఇస్తున్నారు. తాజాగా ముగ్గురు ఎమ్మెల్యేలు ఏకమై.. కక్షగట్టి జెడ్పీ సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డిని బదిలీ చేయించిన తీరుతో ఉద్యోగులంతా హడలిపోతున్నారు.





- ముగ్గురు ఎమ్మెల్యేల దెబ్బకు జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి బదిలీ
- స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో సహకరించలేదని అక్కసు
- ఓ ఎంపీడీఓకు పోస్టింగ్ విషయంలోనూ ఎమ్మెల్యే అమిలినేని అసంతృప్తి
- జెడ్పీ సమావేశానికి వచ్చి చైర్‌పర్సన్ చాంబర్‌లో చంద్రబాబు ఫొటో లేదంటూ రగడ
- ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి... పోస్టింగ్ కూడా ఇవ్వకుండా కసి తీర్చుకున్న వైనం
- నిజాయితీ అధికారుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీశారంటున్న ఉద్యోగులు

అనంతపురం సిటీ: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈఓ) రాజోలి రామచంద్రారెడ్డి విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధత కలిగిన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. ఎక్కడ పని చేసినా.. ముక్కుసూటిగా పని చేయడంతో పాటు సౌమ్యుడిగా, వివాదరహితుడిగా గుర్తింపు పొందారు. నంద్యాల జిల్లా డ్వామా పీడీగా పని చేస్తున్న ఆయన్ను కూటమి ప్రభుత్వం కొన్ని నెలల క్రితం అనంతపురం జెడ్పీ సీఈఓగా బదిలీ చేసింది. డిసెంబర్ 28న ఆయన సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి ప్రభుత్వ ప్రాధాన్యాల మేరకు పని చేశారు. అనతి కాలంలోనే సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు తెచ్చుకోగలిగారు. అలాంటి అధికారిని అధికార టీడీపీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు టార్గెట్ చేశారు. ఎలాగైనా జిల్లా దాటించాలని కంకణం కట్టుకున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లో సీఎం ఫొటో సరైన స్థానంలో లేదంటూ రచ్చచేసి... దానికి సీఈఓను బాధ్యున్ని చేసి... ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బదిలీ చేయించారు.

రామచంద్రారెడ్డిపై కక్ష ఎందుకంటే..

వివిధ కారణాలతో ఖాళీ ఏర్పడ్డ స్థానిక సంస్థల పదవులకు ఇటీవల ఉప ఎన్నికలు నిర్వహించారు. ఆ సందర్భంలో కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు మండల ఉపాధ్యక్ష (వైస్ ఎంపీపీ) స్థానానికి ఉప ఎన్నిక జరిగిన సంగతి తెలిసిందే. ఆ ఎన్నికను ఎలాగైనా వాయిదా వేయించాలని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అక్కడి ఎంపీడీఓపై ఒత్తిడి తెచ్చారు. ‘ఇది ఎన్నికల కమిషన్ నిర్ణయం. మా చేతుల్లో ఏమీ ఉండదు సర్’ అంటూ అక్కడి అధికారి సమాధానమిచ్చారని తెలిసింది. దీంతో జెడ్పీ సీఈఓ ద్వారా ఎన్నిక వాయిదా వేయించాలనుకున్నా... అందుకు సీఈఓ అంగీకరించకపోవడంతో కక్ష పెంచుకున్నట్లు తెలుస్తోంది. అంతకుముందు జిల్లాలో 15 మంది డిప్యూటీ ఎంపీడీఓ(ఈఓపీఆర్‌డీలు)లు, ఏఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతులు రాగా, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి పదోన్నతిపై మరో ఐదుగురు ఎంపీడీఓలు జిల్లాకు వచ్చారు. వారికి పోస్టింగ్ వేసే క్రమంలో కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని బ్రహ్మసముద్రం ఎంపీడీఓగా విజయసింహారెడ్డికి పోస్టింగ్ ఇచ్చారు. ఆయనకు పోస్టింగ్ ఇచ్చే ముందు ఎమ్మెల్యే తనయుడితో పాటు పీఏకూ సమాచారం ఇచ్చినట్లు సమాచారం. అయితే కూతురి పెళ్లి ఏర్పాట్లలో బిజీగా ఉన్న ఎమ్మెల్యే తనకు తెలియకుండా ఎంపీడీఓకు పోస్టింగ్ ఇచ్చారని ఆగ్రహించి విజయసింహారెడ్డిని వెనక్కి పంపేశారని సమాచారం. ఈ రెండు అంశాలను మనసులో పెట్టుకున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు.. మడకశిర, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, దగ్గుపాటి ప్రసాద్‌ను కలుపుకొని.. సీఈఓ రామచంద్రారెడ్డిపై కక్ష గట్టినట్లు స్పష్టమవుతోంది.

మహిళా చైర్‌పర్సన్ చాంబర్‌లోకి ప్రవేశించి..

బోయ సామాజిక వర్గానికి చెందిన గిరిజమ్మ వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచి జెడ్పీ చైర్‌పర్సన్ అయ్యారు. ఆమె పదవీకాలం ఇంకా 15 నెలలు ఉంది. బీసీ కులం నుంచి వచ్చిన గిరిజమ్మ తమ అభిమాన నేత, మాజీ సీఎం జగన్ ఫొటోను తన చాంబర్‌లో ఉంచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటో కూడా తన చాంబర్‌లో ఏర్పాటు చేయించారు. అయితే ఈ నెల 21న జెడ్పీ సర్వసభ్య సమావేశం జరుగుతుండగానే...ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి తదితరులు జెడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లోకి చొరబడ్డారు. జిల్లా ప్రథమ పౌరురాలు, కేబినెట్ ర్యాంకు కలిగిన ప్రజాప్రతినిధి చాంబర్‌లోకి దూసుకెళ్లి చంద్రబాబు ఫొటో ఎక్కడంటూ రచ్చ చేశారు. ఈ సమయంలోనే జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డిని నోటికొచ్చినట్లు మాట్లాడారు. గ్రూప్-1 అధికారి అన్న గౌరవం కూడా లేకుండా అవమానించారు. ఆ తరువాత మాజీ సీఎం జగన్ ఫొటోను బలవంతంగా తీయించి, గాంధీజీ ఫొటో స్థానంలో సీఎం చంద్రబాబు ఫొటో పెట్టించారు.



అనంతపురం జెడ్పీ కార్యాలయంలోని తన చాంబర్‌లో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్యకు చార్జ్ అప్పగిస్తున్న సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డి

కూడబలుక్కొని.. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి..

జెడ్పీ సీఈఓపై కోపం చల్లారని ముగ్గురు ఎమ్మెల్యేలు మరో ప్లాన్ వేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఒకే రోజు వ్యవధిలో ఆయన్ను బదిలీ చేయించి పంతం నెగ్గించుకున్నారు. దీన్ని ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారు. టీడీపీకి చెందిన ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు సైతం తప్పుబడుతున్నారు. అధికారుల ఆత్మస్థైర్యం దెబ్బతీస్తే.. అది ప్రభుత్వానికే ముప్పుగా పరిణమిస్తుందని వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు స్వార్థ రాజకీయాలకు జెడ్పీ సీఈఓను బలిచేయడం దుర్మార్గమంటున్నారు. ఇలాగైతే జిల్లాలో పనిచేసే పరిస్థితులు ఉండవని, ఈ పరిణామాలన్నీ ప్రభుత్వానికి మాయని మచ్చగా మిగులుతాయంటున్నారు. ప్రభుత్వ పెద్దలు వాస్తవాలు తెలుసుకొని నిర్ణయాలు తీసుకుంటే మంచిదని సూచిస్తున్నారు.

అంతటితో ఈ వివాదం సద్దుమణిగిందని అందరూ అనుకున్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన కిడ్నాప్ కథ



తాడిపత్రి పోలీస్‌స్టేషన్ ఆవరణలో బాధితుడు యాసిన్

తాడిపత్రిటౌన్: పట్టణంలో కేబుల్ ఆపరేటర్ యజమానుల మధ్య తలెత్తిన వివాదం నేపథ్యంలో గురువారం వైఎస్సార్‌సీపీ కార్యకర్త యాసిన్‌ను కొందరు టీడీపీ నాయకులు కిడ్నాప్ చేసిన సంగతి తెలిసిందే. అయితే శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డితో పాటు యాసిన్ తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని తనను టీడీపీ నాయకులు ధనుంజయరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, రామాంజులరెడ్డి, బేల్దారి ప్రసాద్ కిడ్నాప్ చేసి రూములో బంధించి ఇనుప పైపులు, కట్టెలతో చావబాదారని, గురువారం రాత్రి సమయంలో వదిలేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటికి చేరుకొన్న తనకు తీవ్ర జ్వరం రావడంతో కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం ఆస్పత్రిలో చికిత్స తీసుకొని వచ్చానని పేర్కొన్నారు. డిష్ గొడవలు ఉంటే యాజమాన్యాలు చూసుకోవాలి కాని అందులో పనిచేసే తమకు ఏం సంబంధం ఉంటుందని యాసిన్ పోలీసుల ముందు వాపోయారు.

నాణ్యమైన విత్తనం అందించాలి



విత్తన శుద్ధిని పరిశీలిస్తున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం సెంట్రల్: ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులకు నాణ్యమైన విత్తనం అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. శుక్రవారం స్థానిక జస్వంత్ ప్రాసెసింగ్ ప్లాంట్‌లో జరుగుతున్న విత్తనశుద్ధి కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓలు రాకేష్‌నాయక్, శ్రీనాథ్‌రెడ్డి, ప్లాంట్ యజమాని రమణ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తుగా ఆశల ‘నైరుతి’

- సాధారణంగా జూన్ రెండో వారంలోనే జిల్లాకు రుతుపవనాలు
- అయితే ఈ సారి ఈనెలాఖరుకే ప్రవేశిస్తాయని శాస్త్రవేత్తలు వెల్లడి
- జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య ‘ఖరీఫ్’కు నైరుతి ప్రభావంతో వర్షాలు
- 319.6 మి.మీ సాధారణం కన్నా అధిక వర్షపాతంపై అన్నదాత ఆశలు



మేఘావృతమైన ఆకాశం

అనంతపురం అగ్రికల్చర్: ఆశల ‘నైరుతి’ ముందస్తుగానే ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ శాఖ తీపి కబురు చెబుతోంది. సాధారణంగా జూన్ ఒకటిన కేరళను తాకే ‘నైరుతి’ ఈసారి ఈ నెల 26నే తాకనున్నాయని ప్రకటించింది. రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నందున ఈ నెల 29 నాటికే ఉమ్మడి ‘అనంత’లోకి ప్రవేశిస్తాయని అంచనా వేస్తున్నారు. చరిత్రను పరిశీలిస్తే.. జూన్ రెండో వారంలో చాలాసార్లు రుతుపవనాలు జిల్లాలోకి ప్రవేశించాయి. అయితే ఈసారి దాదాపు 10 రోజులు ముందుగానే ‘నైరుతి’ పలకరించనుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి లక్షలాది హెక్టార్ల ఖరీఫ్ సాగుకు నైరుతి రుతుపవనాలు (సౌత్‌వెస్ట్ మాన్‌సూన్స్) అత్యంత కీలకం. జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో ప్రభావం చూపిస్తే మంచి వర్షాలు నమోదు కావాల్సి ఉంటుంది.

నైరుతి వర్షాలపై గంపెడాశలు

ఉమ్మడి జిల్లా పరిధిలో దాదాపు 7 లక్షల హెక్టార్లలో సాగులోకి వచ్చే ఖరీఫ్ పంటలకు నైరుతి రుతుపవనాల ప్రభావంతో కురిసే వర్షాలే కీలకం. జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య నాలుగు నెలల పాటు వీటి ప్రభావంతో వర్షాలు నమోదవుతాయి. జిల్లా వార్షిక సాధారణ వర్షపాతం 512.4 మి.మీ కాగా అందులో కీలకమైన ఖరీఫ్ నాలుగు నెలల కాలంలో 319.7 మి.మీ నమోదు కావాల్సి ఉంటుంది. జూన్‌లో 61 మి.మీ, జూలైలో 63.9, ఆగస్టులో 83.8, సెప్టెంబర్‌లో 110.9 మి.మీ సాధారణ వర్షపాతంగా నిర్ధారించారు. నైరుతి ప్రభావంతో కురిసే వర్షాలపై ఆధారపడి ఉమ్మడి జిల్లాలో దాదాపుగా 20 లక్షల ఎకరాల భారీ విస్తీర్ణంలో వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, మొక్కజొన్నతో పాటు మరో 15 రకాల పంటలు సాగు చేస్తారు.

= ఇదిలా ఉండగా రాగల ఐదు రోజులు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో నైరుతి రుతుపవనాలు ప్రవేశం ఇలా..

సంవత్సరం	ప్రవేశం
2014	జూన్ 15
2015	జూన్ 10
2016	జూన్ 9
2017	జూన్ 11
2018	జూన్ 4
2019	జూన్ 21
2020	జూన్ 7
2021	జూన్ 6
2022	జూన్ 13
2023	జూన్ 12
2024	జూన్ 2
2025	??

విఠల.. విఠల.. పాండురంగ విఠల

వైభవంగా రుక్మిణీ పాండురంగస్వామి రథోత్సవం

బొమ్మనహాళ్: ఆంధ్ర పండరీపురంగా ప్రసిద్ధి చెందిన ఉంతకల్లులో రుక్మిణీ పాండురంగ స్వామి బ్రహ్మ రథోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. సాయంత్రం 5.30 గంటలకు పండరీపుర పీఠాధిపతి గోపాల్ మహరాజ్ ఆధ్వర్యంలో రుక్మిణీ పాండురంగస్వామి రథానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తజన సందోహం నడుమ రథోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయం నుంచి గ్రామ ప్రధాన వీధి, బసవన్న ఆలయం వరకు రథాన్ని లాగారు. ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వచ్చిన భక్తులు ‘విఠల... విఠల.. రుక్మిణీ పాండురంగ విఠల’ అంటూ భజనలు చేశారు. అనంతరం పల్లకీ మహోత్సవం నిర్వహించారు. ఎస్ఐ నబీరసూల్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



రుక్మిణీ పాండురంగస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఫ్రీజింగ్ పేరుతో 8 ఏళ్లకే సర్వీస్ పాయింట్లు


అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీ-2014లో ఎంపికైన ఉపాధ్యాయులు 2016 జూన్‌లో జాయిన్ అయ్యారు. వారికి 2024 మే 31 నాటికి 8 సంవత్సరాలు పూర్తవుతుంది. అంటే తప్పనిసరిగా బదిలీ కావాలి. 2024 లో ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు జరపలేదు. దీంతో లాంగ్ స్టాండింగ్ అయినా అదే స్థానాల్లో కొనసాగుతూ వచ్చారు. ఇప్పటికి వారి సర్వీస్ 9 సంవత్సరాలు పూర్తయింది. అయితే ప్రస్తుత బదిలీల్లో ఫ్రీజింగ్ పేరుతో ఎనిమిది సంవత్సరాలకే పాయింట్లను కేటాయిస్తున్నారు. ఇది ఎంతవరకు సబబు అని 2014 డీఎస్సీ ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. స్టేషన్ పాయింట్ల విషయంలో ఉపాధ్యాయుడు ఎన్ని సంవత్సరాలు పని చేస్తే అన్ని సంవత్సరాలు కేటాయించాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు గుజ్జల శివయ్య, ప్రధాన కార్యదర్శి డేగావత్ రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు.

నియామక జాబితాలు లేవట!

డీఎస్సీ-2002కు సంబంధించిన టీచర్ల నియామక జాబితాలు డీఈఓ కార్యాలయంలో లేవని చెబుతున్నారని ఏపీఎస్‌ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్, ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గాండ్లపర్తి శివానందరెడ్డి, జిల్లా నాయకులు వై.ఆదిశేషయ్య, నరసింహారెడ్డి, ఆపస్ నాయకులు ఎర్రిస్వామి మండిపడ్డారు. ఉపాధ్యాయుల సందేహాల నివృత్తికి డీఎస్సీల వారీగా మెరిట్ జాబితాలు అందుబాటులో ఉంచి అడక్వసి ప్రకటించాలని డిమాండ్ చేశారు.

బదిలీల తిప్పలు

- సర్వర్ మొరాయిస్తుండటంతో ఆప్షన్లకు ప్రతిబంధకం
- సింగిల్ టీచర్ ఉన్న చోట డిజేబుల్డ్ అభ్యర్థులకు నో ఛాన్స్
- ఖాళీలపై పారదర్శకత లేకపోవడంతో భయపడుతున్న టీచర్లు
- సర్వీసు పాయింట్ల నమోదులోనూ అవకతవకలు
- నేటితో ఆప్షన్లకు చివరి రోజు కావడంతో అందరిలోనూ ఒకటే భయం
- ఉన్నతాధికారులు, సర్కారు తీరుపై వేలాదిమంది టీచర్ల అనుమానాలు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉపాధ్యాయుల బదిలీల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలు వేలాది మంది ఉపాధ్యాయులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఎన్నో ఏళ్లుగా దూర ప్రాంతాల్లో పని చేస్తూ ఈ బదిలీల్లో దగ్గరకు రావాలనుకుంటున్న వారి ఆశలు అడియాసలు అవుతున్నాయి. బదిలీల్లో డీఈఓ కార్యాలయంలో అన్నీ గోప్యంగా ఉండటం, ఎక్కడ వేకెన్సీలు ఉన్నాయో ఇప్పటికీ తెలియకపోవడం, ఆప్షన్లు పెట్టుకుందామంటే ఎక్కడ పోస్టులున్నాయో తెలియక పోవడం, ఫిజికల్లీ ఛాలెంజ్‌డ్ అభ్యర్థులకు పోస్టింగ్‌లో మెలికలు వంటి కారణాలతో వేలాదిమంది టీచర్లు ఆందోళనలో ఉన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు ఏడు వేల మందికి పైగా ఉపాధ్యాయులకు బదిలీ అవకాశం ఉంది. కానీ పారదర్శకత లేకపోవడమే వారిని కలవర పెడుతోంది.

సర్వర్ మొరాయింపుతో ఆప్షన్లకు ఆటంకం

టీచర్ల బదిలీకి విద్యాశాఖ ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించింది. ఏ టీచర్ అయినా ఈ వెబ్‌సైట్ ద్వారానే బదిలీకి ఆప్షన్ ఇవ్వాలి. దీనికి నేటితో అంటే మే 24తో గడువు ముగుస్తుంది. కానీ ఇక్కడ సర్వర్ పని చేయడం లేదు. ఓపెన్ అయిన ఐదు నిమిషాల్లోనే మళ్లీ కట్ అవుతోంది. దీంతో ఆప్షన్లకు మధ్యలోనే ఆటంకం ఎదురవుతోంది. వందలాది మంది ఉపాధ్యాయులు సర్వర్ పనిచేయకపోవడంతో ఆప్షన్లు ఇవ్వలేకపోతున్నారు. మరో రెండు రోజులు గడువు పెంచాలని కోరుతున్నారు.

సింగిల్ టీచర్ ఉన్నచోటుకు మేమెందుకు వెళ్లకూడదు?

సింగిల్ టీచర్ ఉన్న చోట రకరకాల ప్రాధాన్యత (ప్రిఫరెన్షియల్) ఉపాధ్యాయులు వెళ్లకూడదని జీవోలో ఇవ్వడంపై ఫిజికల్లీ ఛాలెంజ్‌డ్ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదాహరణకు బుక్కరాయసముద్రం హైస్కూలులో ఒక సబ్జెక్టుకు సింగిల్ టీచర్ ఉండి ట్రాన్స్‌ఫర్ అయినా, లేదా వేకెన్సీ ఉన్నా అక్కడకు మరో అంధ, ఆర్థోపెడిక్ వైకల్యం, వితంతు, క్యాన్సర్ పేషెంట్ ఇలాంటి వాళ్లు వెళ్లడానికి వీలు లేదని ఉంది. దీని వల్ల తమకు సీనియారిటీ ఉన్నా కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని, తీవ్ర అన్యాయం జరుగుతోందని వారు చెబుతున్నారు.

సీనియారిటీ పాయింట్లలో గందరగోళం

జీఓను అనుసరించి సర్వీసునుబట్టి, రూరల్‌లో పని చేస్తున్న, స్టేషన్ సీనియారిటీ వంటివి ఆధారంగా పాయింట్లు వస్తాయి. కానీ ఆప్షన్లు ఇస్తున్న కొంత మంది టీచర్లకు తమ పాయింట్లు లేవు. కొంతమంది అర్హత లేని టీచర్లకు పాయింట్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో రెండ్రోజులుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. కనీసం దీనిపై డీఈఓ కార్యాలయాల్లో స్పందించేవారే లేరు. ఎవర్ని అడగాలో తెలియక, ఎక్కడ సమస్యకు పరిష్కారం దొరుకుతుందో తెలియక సతమతమవుతున్నారు. గతంలో ఏ సర్కారూ ఇలా గందరగోళ పరిస్థితులను సృష్టించలేదని వాపోతున్నారు.

విద్యాశాఖలో ఏమి జరుగుతోంది?

- డీఈఓను నిలదీసిన నాయకులు



డీఈఓతో వాగ్వాదం చేస్తున్న నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియను గతంలో ఎప్పుడూ లేనివిధంగా విద్యాశాఖ అధికారులు, సిబ్బంది అత్యంత రహస్యంగా నిర్వహించడం వెనుక ఆంతర్యమేమిటని ఉపాధ్యాయ సంఘాల నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని శారదా బాలికల పాఠశాలలో డీఈఓ ప్రసాద్‌బాబును నిలదీశారు. ఇంత గోప్యతగా ఎందుకు చేపడుతున్నారని ప్రశ్నించారు. డీఎస్సీల వారీగా మార్కులు, మెరిట్ ర్యాంకుల వివరాలు తెలియజేయాలని మూన్నెళ్ల నుంచి అడుగుతున్నా ఇప్పటిదాకా బయటకు పెట్టకపోవడం వెనుక ఉద్దేశం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ర్యాంకులు, మార్కులు బయటకు చెప్పకుండా తాము ఇచ్చిన జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని అడిగితే ఎలా చెప్పాలని ప్రశ్నించారు. రాయలసీమ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ సీనియార్టీ జాబితాలు విడుదలవుతున్నా ఇక్కడ మాత్రం ఏఒక్కటీ చెప్పడం లేదన్నారు.

సంఘాలకు చెప్పకూడదనుకుంటున్నారా?

బదిలీలకు సంబంధించిన అనేక సందేహాల నివృత్తి కోసం డీఈఓకు వందలసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండి పడ్డారు. బదిలీలకు సంబంధించి రాష్ట్ర అధికారుల నుంచి రోజూ నాలుగైదుసార్లు వెబెక్స్‌లు నిర్వహిస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నా ఏఒక్కటీ ఉపాధ్యాయ సంఘాల నాయకులకు చెప్పడం లేదన్నారు. ‘అన్నీ ఎంఈఓలకు పంపుతున్నామంటున్నారు. అంటే ఉపాధ్యాయ సంఘాల నాయకులకు చెప్పకూడదనుకుంటున్నారా’ అని ప్రశ్నించారు. శనివారం ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి చర్చించకపోతే ధర్నా చేపడతామని హెచ్చరించారు. దీంతో దిగొచ్చిన డీఈఓ...ఇకపై టీచర్లకు సంబంధించిన ప్రతి సమాచారం సంఘాల నాయకుల వాట్సాప్ గ్రూపులోనూ పెడతామన్నారు. సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ నాయక్, రామాంజనేయులు, సూరీడు, సిరాజుద్దీన్, రమణారెడ్డి, ఎర్రిస్వామి, వెంకటరత్నం, శ్రీనివాస్ రెడ్డి, రాయల్ వెంకటేష్, లింగమయ్య, నరసింహులు, కులశేఖర్‌రెడ్డి, హనుమేష్, వెంకటసుబ్బయ్య, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హెచ్చెల్సీ ఎస్ఈగా పురార్థనరెడ్డి బాధ్యతలు



ఎస్ఈకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న హెచ్చెల్సీ ఉద్యోగులు

అనంతపురం సెంట్రల్: హెచ్చెల్సీ ఎస్ఈగా పురార్థనరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల జిల్లా ఎస్ఆర్బీసీ ప్రాజెక్టు సర్కిల్–1 ఎస్ఈగా పనిచేస్తున్న ఆయనకు హెచ్చెల్సీ ఎస్ఈ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నూతన ఎస్ఈకు హెచ్చెల్సీ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు.

అదృశ్యమైన మహిళలు ఉరవకొండలో ప్రత్యక్షం

ఉరవకొండ: కళ్యాణదుర్గం పట్టణంలోని పార్వతీ నగర్‌లో ఉన్న ఉజ్వల హోం నుంచి ఈనెల 22న అదృశ్యమైన ఇద్దరు మహిళల ఆచూకీ లభించింది. ఉరవకొండ అర్బన్ సీఐ మహానంది వివరాల మేరకు.. కుందుర్పి, కణేకల్లు మండలాలకు చెందిన యువతులు కళ్యాణదుర్గంలోని ఉజ్వల హోం నుంచి అదృశ్యమైనట్లు సోషల్ మీడియాలో పోస్టు చేశామన్నారు. ఉరవకొండ బస్టాండ్‌లో వారిని స్థానికులు గుర్తించి తమకు సమాచారం ఇచ్చారని తెలిపారు. వెంటనే వారిని కళ్యాణదుర్గం పోలీసులకు అప్పగించామన్నారు.

డ్రైవర్ దుర్మరణం




ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

విడపనకల్లు: మండల పరిధిలోని హంచనహాల్ సమీపంలోని 67వ జాతీయ రహదారిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ ఈరన్న (42) మృతి చెందాడు. కర్ణాటకలోని కంప్లీ నుంచి గుంతకల్లు వైపు వెళ్తున్న లారీ మండల పరిధిలోని హంచనహాల్ సమీపంలోకి రాగానే టైర్ పంక్చర్ కావడంతో డ్రైవర్ లారీని ఆపీ టైరు కింద రాళ్లను పెట్టేందుకు వెనుక వైపునకు వెళ్లాడు. అదే సమయంలో గుంతకల్లు వైపు నుంచి వస్తున్న లారీ వేగంగా వచ్చి పంక్చరైన లారీని ఢీకొట్టింది. ఘటనలో డ్రైవర్ ఈరన్న అక్కడికక్కడే చనిపోయాడు.

త్యాగానికి ప్రతిరూపం కల్లూరు

- స్వాతంత్ర్యోద్యమంలో కల్లూరు సుబ్బారావు కీలక పాత్ర
- నీలం, తరిమెల, ఐదుకల్లు వంటి వారిలో స్ఫూర్తి నింపిన వైనం
- ఆదివారం జయంతి నిర్వహణకు ఏర్పాట్లు
- కల్లూరు స్మారక పురస్కారానికి ఎంపికైన బాలగొండ



అనంతపురం కల్చరల్: చాలా కొద్ది మంది మాత్రమే తమదైన వ్యక్తిత్వంతో విలువలతో కూడిన జీవన విధానంతో గొప్పవారవుతారు. ఆ కోవకు చెందిన 'అనంత' త్యాగధనుడు స్వాతంత్ర్య సమరయోధుడు కల్లూరు సుబ్బారావు. నిరుపమాన త్యాగమయ జీవితంతో, విలక్షణ వ్యక్తిత్వంతో ప్రసిద్ధికెక్కిన కల్లూరు సుబ్బారావు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగానే నగరానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త , సినీ దర్శకుడు బాలగొండ ఆంజనేయులకు 'కల్లూరు సుబ్బారావు స్మారక అవార్డు' అందిస్తున్నారు.

రాయలసీమ పితామహుడు 'కల్లూరు'

ఉమ్మడి అనంతపురం జిల్లా హిందూపురం సమీపంలోని కల్లూరు గ్రామంలో 1897 మే 25న కల్లూరు సుబ్బారావు జన్మించారు. 1913లో దివ్యజ్ఞాన సమాజం వ్యవస్థాపకులు అనిబీసెంట్ హిందూపురం రావడంతో ఆమె ప్రసంగాలకు ఆకర్షితులై జాతీయోద్యమంలో చేరారు. స్వాతంత్ర్యోద్యమంలో రాయలసీమ జిల్లాల తరఫున శిక్షణ పొంది అందరిలో చైతన్యం తెచ్చారు. మన జిల్లాలో శిక్షణ పొందిన మొట్ట మొదటి రాజకీయ ఖైదీ సుబ్బారావు కావడం విశేషం. 1921 సెప్టెంబర్ 28న శిక్షా కాలం పూర్తయిన తర్వాత బళ్లారి సభలో గాంధీజీతో కలసి మళ్లీ ఉద్యమంలో పాల్గొన్నారు. 1928 నవంబర్‌లో నంద్యాలలో జరిగిన సభలో దత్త మండలాలకు రాయలసీమ అని పేరు పెట్టిన వారిలో కల్లూరు ప్రముఖులు. నీలం సంజీవరెడ్డి, తరిమెల నాగిరెడ్డి, ఐదుకల్లు సదాశివన్ వంటి అనంత ఆణిముత్యాలు కల్లూరి సుబ్బారావు స్ఫూర్తితో జాతీయస్థాయిలో రాణించారు. 1937లో రాయలసీమ వారికి అన్యాయం జరగకుండా 'శ్రీబాగ్ ఒడంబడిక'పై సంతకం చేశారు. అనంతపురంలో ఇంజినీరింగ్ కళాశాల స్థాపన, టవర్‌క్లాక్ నిర్మాణంలో ఆయన పాత్ర ఎనలేనిది.

పద్మశ్రీతో సత్కారం

లలితకళలపై అసమాన అభిమానంతో నగరంలోని విలువైన తన సొంత స్థలాన్ని కల్లూరు సుబ్బారావు 'లలిత కళాపరిషత్'కు దానంగా ఇచ్చారు. అది ఇప్పటికీ 'కల్లూరు సుబ్బారావు కళా ప్రాంగణం' గానే పిలవబడుతోంది. కళాకారులు అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహం పూజలందుకుంటూనే ఉంది. ఆయన నిరుపమాన సేవలను గుర్తించి ప్రభుత్వం 1967లో 'పద్మశ్రీ' అవార్డుతో సత్కరించింది. అభ్యుదయ కార్యక్రమాలకు నాంది పలికిన రాయలసీమ వైతాళికులు కల్లూరు సుబ్బారావు 1973 డిసెంబర్ 20న కన్నుమూశారు.

విలక్షణ కథకుడు 'బాలగొండ'



కన్నడ, తెలుగు భాషా పండితుడిగా, త్యాగానికి ప్రతిరూపంగా నిలిచిన కల్లూరు సుబ్బారావు చిరస్మరణీయ జీవితాన్ని భావితరాలు గుర్తుంచుకునేలా లలితకళాపరిషత్తు ఆధ్వర్యంలో 'కల్లూరు సుబ్బారావు స్మారక అవార్డు' అందిస్తున్నారు. ఈసారి ఆ అవార్డు బాలగొండ ఆంజనేయులును వరించింది. పోలీసు అధికారిగా, కథకుడిగా, కళాకారుడిగా, నవలా రచయితగా ప్రసిద్ధి పొందారు. ఆయన రాసిన కథలు, నవలలు ఎంతో మందిని ఆలోచింపజేశాయి. 1991 నుంచి 2001 వరకూ జిల్లా రచయితల సంఘంలో వివిధ హోదాలలో సాహితీ సేవలందించారు. 'తిమ్మమ్మ మర్రిమాను' ప్రాశస్త్యాన్ని నవల రూపంలో రాయడమే కాకుండా దాన్ని సినిమాగా తీసి స్వయంగా దర్శకత్వం వహించారు. అలాగే మొగ్గల్జడ నవల రాసి స్క్రీన్‌ప్లే, మాటలు అందించారు. గతంలో ఆయన ప్రభుత్వం అందించే ఉగాది పురస్కారాన్ని, మొల్ల సాహితీ పురస్కారాలనందుకున్నారు. బాలగొండ ఆంజనేయులు సేవలను గుర్తిస్తూ పురస్కారానికి ఎంపిక చేయడంపై పలువురు కళాకారులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఎల్కేపిలో పురస్కార ప్రదానోత్సవం, సాంస్కృతిక సంబరాలు జరుగుతాయని, కళాభిమానులు విచ్చేయాలని కార్యదర్శి పద్మజ కోరారు.

జంట హత్యల కేసులో మరొకరికి రిమాండ్

రాప్తాడు: మండలంలోని గొల్లపల్లి దగ్గర జరిగిన చిగిచెర్ల నారాయణరెడ్డి, ముత్యాలమ్మ జంట హత్య కేసులో ఏడుగురు నిందితుల అరెస్ట్ తర్వాత తాజాగా మరో నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీహర్ష తెలిపారు. హత్య జరిగిన సమయంలో గాయపడిన పామాల కొండప్ప అలియాస్ లక్షల కొండప్ప అనే నిందితుడు అనంతపురంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం నిందితుడు కొండప్ప డిశ్చార్జ్ కావడంతో పోలీసులు వెంటనే తమ అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా.. బాల నరసింహారెడ్డి కోర్టులో ఎలా లొంగిపోయాడో అదే రీతిలో లొంగిపోవాలని మిగిలిన మరో ముగ్గురు నిందితులు పామాల్ల పండయ్య, గొనిపట్ల శీనా, పాత్రికేయుడు గొల్లపల్లికి చెందిన పెద్దింటి జగదీష్ భావిస్తున్నట్లు సమాచారం. వీరిలో ఒక నిందితుడి సోదరుడు పోలీసు ఉన్నతాధికారి కావడంతోనే ఆయన సలహాతోనే వారు పోలీసులకు దొరకకుండా తిరుగుతున్నట్లు తెలిసింది.

ఎలుగు దాడిలో వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: ఎలుగు బంటి దాడిలో వ్యక్తి గాయపడిన సంఘటన శుక్రవారం జరిగింది. మండల పరిధిలోని మోరేపల్లికి చెందిన బాల రాయుడు తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లిన సమయంలో ఎలుగు బంటి దాడిచేసింది. ఆయన కేకలు వేయటంతో ఎలుగు బంటి పక్కనే ఉన్న పొదల్లోకి పారిపోయింది. గాయపడిన బాల రాయుడు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించండి

పామిడి: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం పామిడి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయన తనిఖీ చేశారు. వైద్యసేవలపై రోగులతో ఆరా తీశారు. అనంతరం వైద్యాధికారి శివకార్తీక్‌రెడ్డితో సమీక్ష నిర్వహించారు. సర్జికల్ ప్రొసీజర్స్‌పై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. నెలకు 30 ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. నియోజకవర్గ స్పెషలాఫీసర్లు ఆసుపత్రి వైద్యసేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, తహసీల్దార్ ఆర్.శ్రీధరమూర్తి, డాక్టర్ మహేష్, హెడ్ నర్స్ శివకుమారి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పామిడి సీహెచ్‌సీలో వైద్యసేవలపై రోగితో ఆరా తీస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

అనంతపురం అర్బన్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ప్రపంచ పర్యావరణ దినోత్సవం–2025పై అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. పర్యావరణ దినోత్సవం థీమ్ ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడమేనన్నారు. ఈ క్రమంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలుకు కార్యాచరణ తయారు చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణపై శనివారం గ్రామస్థాయిలో అవగాహన సమావేశాలు, ర్యాలీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 25న వ్యర్థాల విభజన, ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలపై ప్రచారం చేయాలన్నారు. ఇలా జూన్ 4 వరకు నిర్దేశించిన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు నిర్వహించి ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, రేంజ్ అటవీ అధికారి శ్రీనివాసులు, పీఆర్ డీఎల్‌పీఓ విజయ్‌కుమార్, డీపీఆర్‌సీ రీసోర్స్ పర్సన్ మాధవి, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుతోనే సమగ్రాభివృద్ధి

పరిశ్రమల ఏర్పాటుతోనే జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యమని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్ని అనుమతులు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా నిర్ణీత గడువులోపు మంజూరు చేయాలని ఆదేశించారు. స్టాండప్ ఇండియా పథకం కింద లబ్ధిదారుల రుణాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. విశ్వకర్మ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి శిక్షణ, రుణం మంజూరుకు చర్యలు తీసుకోవాలని నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారిని ఆదేశించారు. బనానా ఫైబర్‌తో బ్యాగ్‌లు, టోపీలు తయారు చేయవచ్చన్నారు. ఇందుకు సంబంధించి ఎస్‌హెచ్‌జీ సభ్యులకు, రైతులకు పీఎంఈజీపీ కింద రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ కింద 21 యూనిట్లకు రూ.62.86 లక్షల సబ్సిడీ మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపింది. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాసయాదవ్, వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారెడ్డి, ఎల్‌డీఎం నరేష్‌రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీ, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వీఆర్ఓల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



సాయికుమార్, అధ్యక్షుడు



విరూపాక్షరెడ్డి, ప్రధాన కార్యదర్శి

అనంతపురం అర్బన్: ఏపీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ గ్రేడ్–2 వీఆర్ఓల సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి స్వరూప్ మాట్లాడుతూ జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేయానికి అందరూ కృషి చేయాలన్నారు.

నూతన కమిటీ.. : సంఘం జిల్లా అధ్యక్షుడిగా సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా విరూపాక్షరెడ్డి ఎన్నికయ్యారు. కోశాధికారిగా రాజు, ఉపాధ్యక్షులుగా నరేష్‌కుమార్, కుమారస్వామి, రాఘవేంద్రరాజు, సంయుక్త కార్యదర్శులుగా అనిల్, అశోక్‌కుమార్, రఘు యాదవ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా పురుషోత్తం, లిఖిత ఎన్నికయ్యారు. పర్యవేక్షక సభ్యులుగా సయ్యద్ అఫ్రిది, వెంకట రాజేష్, దిల్షాద్, వీరేష్, ఆదినారాయణ, నీలకంఠరెడ్డి ఎన్నికయ్యారు.

కమీషన్ల కక్కుర్తికి బాలుడి ప్రాణాలు బలి

- బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు ఇవ్వాలని సీపీఐ నేత జగదీష్ డిమాండ్

గుంతకల్లు: నాసిరకం నిర్మాణ పనులతో ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకుంటున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ.జగదీష్ విమర్శించారు. శుక్రవారం గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో పెచ్చులూడి పడి మణికంఠ అనే బాలుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న సీపీఐ, సీపీఎం నాయకుల బృందం వేర్వేరుగా స్థానిక రైల్వేస్టేషన్‌లోని 6–7 నంబర్ల ప్లాట్‌ఫారాల్లో ఘటన జరిగిన ప్రదేశాన్ని సందర్శించారు. అనంతరం సీపీఐ నేత జగదీష్ విలేకరులతో మాట్లాడారు. గుంతకల్లు రైల్వేస్టేషన్‌ను రూ.కోట్ల ఖర్చుతో ఆధునీకరించారన్నారు. రైల్వే అధికారులు కమీషన్లు, పర్సంటేజీలకు కక్కుర్తిపడి నాసిరకం నిర్మాణాలను పట్టించుకోలేదన్నారు. నాసిరకం పనులు చేపట్టిన కాంట్రాక్టరును బ్లాక్‌లిస్ట్ పెట్టడంతో పాటు సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మణికంఠ కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించడంతో పాటు వారి కుటుంబంలో ఒకరికి రైల్వే ఉద్యోగమిచ్చి ఆదుకోవాలన్నారు. అంతకు ముందు సీపీఐ నాయకుల బృందాన్ని రైల్వేస్టేషన్‌లోకి వెళ్లకుండా ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆర్‌పీఎఫ్‌పై అధికారి అనుమతితో వారిని స్టేషన్‌లోపలికి అనుమతి ఇచ్చారు.కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, మహేష్, గోపీనాథ్, రాముడాయల్, ఎస్ఎండీ గౌస్ పాల్గొన్నారు.



గోడ పెచ్చులూడి బాలుడు మృతి చెందిన ప్రదేశాన్ని చూపుతున్న సీపీఐ నేత జగదీష్

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం అగ్రికల్చర్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సులపై నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 10 పాస్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ ఫెయిల్ లేదా పాసై ఉండాలన్నారు. 18 నుంచి 28 సంవత్సరాల వయస్సున వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు బెంగళూరులో 35 రోజుల పాటు ఉచిత శిక్షణ, వసతి, భోజన సదుపాయం ఉంటుందని తెలిపారు. కంప్యూటర్, ట్యాలీ కోర్సులతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్ లాంటి అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 90004 87423 నంబరులో సంప్రదించాలని సూచించారు.

రేపు కనకదాస ప్రతిభా పురస్కారాల ప్రదానం


అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చాటిన ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కురుబ సామాజిక విద్యార్థులకు ఈనెల 25న కనకదాస ప్రతిభా పురస్కారాలు పంపిణీ చేయనున్నట్లు కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అర్వేటి పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గుత్తిరోడ్డులోని కనకదాస కల్యాణ మండపంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, కురుబ ఉద్యోగులు, కులస్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'రాయలసీమ అభివృద్ధిపై టీడీపీ మహానాడులో తీర్మానం చేయాలి'

ఉరవకొండ: రాయలసీమ అభివృద్ధిపై పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి టీడీపీ ఆధ్వర్యంలో జరిగే మహానాడులో తీర్మానం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వై.మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ వాసిగా ఐదోసారి సీఎం అయిన చంద్రబాబు ఇప్పటికైనా రాయలసీమ అభివృద్ధిపై చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను 80 వేల క్యూసెక్కులకు పెంచి, గాలేరు–నగరి ను హంద్రీనీవాకు అనుసంధానం చేయాలన్నారు. హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని 10 వేల క్యూసెక్కులకు పెంచి, డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేయాలన్నారు. హెచ్చెల్సీ ఆధునీకరణ పనులు పూర్తి చేసి, తుంగభద్ర సమాంతర కాలువను తవ్వాలన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

- సీఐ, ఎస్ఐలే కారణమంటున్న బాధితురాలు



ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న యషిక

అనంతపురం మెడికల్/కదిరి అర్బన్: కదిరి పట్టణానికి చెందిన యషిక సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చేర్పించారు. యషిక, ఆమె తండ్రి లక్ష్మీనారాయణ వివరాల మేరకు.. కదిరికి చెందిన లక్ష్మీనారాయణ, శిరీష దంపతుల మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో శిరీషకు సంబంధించి ఫొటోలను మార్ఫింగ్ చేశారన్న ఆరోపణలపై యషిక, ఆమె తండ్రి లక్ష్మీనారాయణ తదితరులను పోలీసుస్టేషన్‌కు రావాలని పిలుపుస్తున్నారు. ఇదే క్రమంలో శుక్రవారం యషికకు సీఐ నారాయణరెడ్డి ఫోన్ చేసి దుర్భాషలాడడంతో ఆమె స్టేషన్‌కు వెళ్లింది. అక్కడ సీఐతో పాటు ఎస్ఐ బాబ్జాన్ నానా మాటలు అనడంతో మనస్తాపంతో యషిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. టీడీపీ నాయకుల ఒత్తిళ్లతోనే పోలీసులు తమను వేధిస్తున్నారని, శిరీషతో ఇప్పటికే విడాకులకు దరఖాస్తు చేసుకున్నట్లు లక్ష్మీనారాయణ తెలిపారు. ఇదిలా ఉండగా.. తాను తన మిత్రుడితో కలసి ఉన్న ఫొటోలను మార్ఫింగ్ చేశారని శిరీష కదిరి పట్టణ పోలీసులను ఆశ్రయించింది. రూ. 3 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో పాటు అసభ్యకరంగా మాట్లాడారని ఆరోపించింది. శిరీష ఫిర్యాదు మేరకు ఆమె భర్త లక్ష్మీనారాయణ, కుమార్తె యషిక, ఆమె భర్త శివ, జగదీష్ అనే వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

వికసించిన మే పుష్పాలు



అనంతపురం కల్చరల్: మే మాసంలో మాత్రమే వికసించి అందాలొలికే బ్రహ్మకమలాలు (మే పుష్పాలు) నగరంలోని మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నారపరెడ్డి ఇంట అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా నారపరెడ్డి మాట్లాడుతూ కోవూరు నగర్‌లోని తమ ఇంట్లో పాతికేళ్లుగా మే పుష్పాలు వికసిస్తున్నాయని, తక్కువ కాలం మాత్రమే ఉండే ఈ పుష్పాలను చూడడానికి చాలా మంది ఆసక్తి చూపుతున్నారని తెలిపారు.

నగర పాలక మేనేజర్‌గా సుజాత

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ మేనేజర్‌గా సుజాతను నియమిస్తూ కమిషనర్ బాలస్వామి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె ఇదివరకు పబ్లిక్ హెల్త్ సెక్షన్‌లో సూపరింటెండెంట్ పనిచేశారు. అనేక నెలలుగా ఖాళీగా ఉన్న మేనేజర్ స్థానాన్ని సుజాతతో భర్తీ చేశారు. ఇప్పటికైనా ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌లో పనులు వేగవంతంగా జరుగుతాయో లేదో చూడాలి.

త్యాగరాజ గానసభలో నేడు సంగీత కచేరీ

అనంతపురం కల్చరల్: నగరంలోని త్యాగరాజ సంగీత గాన సభలో శనివారం సాయంత్రం 6 గంటలకు శాస్త్రీయ సంగీత కచేరీ నిర్వహించనున్నట్లు సభ అధ్యక్షుడు ఎన్.సి.సంపత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సంగీత సభలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయనతో పాటు సభ్యులు మాట్లాడారు. సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు ఆల్ ఇండియా రేడియో మాజీ డైరెక్టర్ డాక్టర్ కె.వాగేష్ కృష్ణ నేతృత్వంలో సంగీత కచేరీ జరుగుతుందన్నారు.

బాల్య వివాహాలు అనర్థదాయకం

- ఐసీడీఎస్ పీడీ నాగమణి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ నాగమణి

రాప్తాడురూరల్: బాల్య వివాహాలు అనర్థదాయకమని ఐసీడీఎస్ పీడీ నాగమణి అన్నారు. శుక్రవారం అనంతపురం రూరల్ ప్రాజెక్ట్ పరిధిలోని లెనిన్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. పీడీతో పాటు రూరల్ సీడీపీఓ ధనలక్ష్మీ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కిశోర బాలికలు రుతుక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. లైంగిక అంశాలు, బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. బాలల హక్కుల రక్షణ, పోక్సో చట్టం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లీలావతి, మహిళా సంరక్షక కార్యదర్శి మల్లేశ్వరి, అంగన్‌వాడీ హెల్పర్లు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

పారిశుధ్య వాహనాల ప్రారంభం



వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం మెడికల్: నగరంలో పారిశుధ్యం మెరుగు కోసం రూ.2.5 కోట్లు విలువ చేసే వాహనాలను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలసి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ శుక్రవారం నగరపాలక సంస్థ వద్ద ప్రారంభించారు. కమిషనర్ బాలస్వామి మాట్లాడుతూ ఎస్ క్యాప్ నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ బొలెరో, స్ప్రింక్లర్, వాహనం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, మెకానికల్ స్వీపింగ్ మిషన్ 2, సాధారణ నిధుల కింద ల్యాడర్ వాహనంతో కలుపుకుని మొత్తం ఐదు వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఎస్ఈ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి

అనంతపురం కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ (ఏపీజీఈఏ)రాష్ట్ర కౌన్సిల్ 3వ మహా సభల పోస్టర్‌ను నాయకులు శుక్రవారం నగరంలోని 69వ సచివాలయం ఆవరణలో ఆవిష్కరించారు. వచ్చే నెల 5న విజయవాడలో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా నాయకులు వరప్రసాద్, మహేష్ నాయక్, శివశంకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దగ్గుపాటి అబద్ధాలకోరు

- ఎమ్మెల్యే దందాలను బయటపెడతా
- అనంతను విమర్శించే అర్హత ఆయనకు లేదు
- ఎమ్మెల్యే దగ్గుపాటిపై మేయర్ వసీం ఫైర్



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ చేస్తున్న దందాలు, దౌర్జన్యాలు, అవినీతిని ప్రజాస్వామ్య పద్ధతిలో బయటపెడతానని నగర పాలక సంస్థ మేయర్ వసీం అన్నారు. నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలే మాట్లాడతారని ఎమ్మెల్యేపై మండిపడ్డారు. బయోమైనింగ్‌పై చేతనైతే విచారణ చేసుకోవాలని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అవినీతి జరిగిందంటూ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిపైన, తనపైన మరోసారి విమర్శలు చేస్తే బాగుండదని హెచ్చరించారు. శుక్రవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా నగరపాలక సంస్థకు మంజూరైన వాహనాలను డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్యతో కలసి మేయర్ పరిశీలించారు. ఎమ్మెల్యే దగ్గుపాటికి ఏ విషయంపైనా సరైన అవగాహన లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే అనంతను విమర్శించే అర్హతే దగ్గుపాటికి లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి హయాంలో నగరంలో రూ.1,045 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని వెల్లడించారు.

రూ.11 కోట్ల బిల్లుల్లో రూ.9 కోట్ల అవినీతా?

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బయోమైనింగ్ ద్వారా చెత్త నిర్వహణకు శ్రీకారం చుట్టారని, ఇప్పటి వరకు సదరు కంపెనీకి చెల్లించింది రూ.11 కోట్లు అయితే అందులో రూ.9 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఎమ్మెల్యే దగ్గుపాటి ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందని మేయర్ వసీం అన్నారు. బయోమైనింగ్‌పై విచారణ చేయించాలని తానే స్వయంగా కలెక్టర్‌ను కోరానని గుర్తు చేశారు. చేతనైతే విచారణ లోతుగా చేయించుకోకుండా మళ్లీ ఆ పనులకు బిల్లులు చేయండంటూ ఎమ్మెల్యే ఒత్తిడి తేవడం వెనుక ఆంతర్యమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.

ముమ్మాటికీ దగ్గుపాటే డమ్మీ..

కూటమి ప్రభుత్వం ఏర్పాటై 11 నెలలు కావస్తున్నా నగర అభివృద్ధికి ఏమైనా చర్యలు తీసుకున్నావా? ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించావా అని ఎమ్మెల్యేను మేయర్ ప్రశ్నించారు. అభివృద్ధి పనులకు అడ్డుపడుతోంది నీవు కాదా దగ్గుపాటీ అని ధ్వజమెత్తారు. అనంత చొరవతో తమ పాలకవర్గంలో అనంతపురం రూపురేఖలు మార్చామని వివరించారు. కూటమి ప్రభుత్వంలో నగరాన్ని అభివృద్ధికి నోచుకోకుండా చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటినే డమ్మీ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనుంచైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. నీ బెదిరింపులకు ఎవ్వరూ భయపడరని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కమల్‌భూషణ్, శ్రీనివాసులు, అనిల్‌కుమార్ రెడ్డి, సైఫుల్లాబేగ్, నాయకులు సాకే కుళ్లాయస్వామి, దాదాఖలందర్, గంగాధర్, కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుపై శ్రద్ధేదీ?

అనంతపురం కార్పొరేషన్: కూటమి పార్టీల ప్రజాప్రతినిధులకు ఫొటోలపై ఉన్న శ్రద్ధ ఎన్నికల హామీల అమలుపై లేకుండా పోయిందని వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు బాకే హబీబుల్లా విమర్శించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశాడు. ఇటీవల జెడ్పీలో చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ చాంబర్‌లోకి దూసుకెళ్లి టీడీపీ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరును ఆయన తప్పుబట్టారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా లేదానన్న అనుమానం కలుగుతోందన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ప్రజాస్వామ్యాన్ని పాలకులు అపహాస్యం చేస్తున్నారని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో తప్పక బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాల వేలం

అనంతపురం: అనంతపురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు తెలియని 17 ద్విచక్ర వాహనాలను శుక్రవారం స్క్రాప్ కింద బహిరంగ వేలం వేశారు. మొత్తం రూ.1,01,900 నగదు వసూలు అయినట్లు సీఐ కే.సాయినాథ్ తెలిపారు.

ఇండో ఎంఐఎంతో జేఎన్‌టీయూ సంప్రదింపులు



ఇండో ఎంఐఎం కంపెనీని సందర్శిస్తున్న వీసీ సుదర్శనరావు

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం)లో ఇండో ఎంఐఎం సంస్థ ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు కోసం సంప్రదింపులు జరుపుతున్నట్లు వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు తెలిపారు. తిరుపతిలోని ఇండో ఎంఐఎం సంస్థను వీసీ శుక్రవారం సందర్శించారు. మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉపయుక్తం అయ్యేలా ఇంక్యుబేషన్ కేంద్రం ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు. ఇందుకు ఆ సంస్థ అంగీకరించినట్లు వీసీ తెలిపారు.

కుర్లపల్లిలో మలేరియా



కుర్లపల్లిలో ప్రజలకు ఆరోగ్య సూచనలు తెలియజేస్తున్న మలేరియా అధికారులు



కుర్లపల్లిలో ఫాగింగ్ చేస్తున్న అధికారులు

- గ్రామంలో పర్యటించిన వైద్య సిబ్బంది

ఆత్మకూరు: మండలంలోని కుర్లపల్లి గ్రామంలో మలేరియా కేసు నమోదైంది. ఓ బాలికకు మలేరియా పాజిటివ్ వచ్చింది. దీంతో వైద్య, ఆరోగ్య సిబ్బందితో పాటు జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య శుక్రవారం కుర్లపల్లి గ్రామంలో పర్యటించారు. 183 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు. మలేరియా బారిన పడిన బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించి 14 రోజుల పాటు చికిత్స తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. దోమల నివారణకు మందును పిచికారీ చేయించారు. గ్రామంలో రెండు రోజుల పాటు ఫాగింగ్ చేయాలని సచివాలయ కార్యదర్శికి సూచించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సబిహా సుల్తానా, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది శ్రీధర్ మూర్తి, నూర్ బాషా, మధుబాబు, మహేశ్వరి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

'90 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేయాలి'



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున

అనంతపురం అర్బన్: ఖరీఫ్‌కు సంబంధించి అన్ని రకాల విత్తనాలను 90 శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని రైతుసంఘం కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున విలేకరులతో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ముందస్తుగా కురుస్తున్న వర్షాలతో రైతులు దుక్కులు చేసుకుని సాగుకు సిద్ధమవుతున్నారన్నారు. ఎకరాకు మూడు బస్తాల విత్తన వేరుశనగ కాయలు ఇవ్వాలన్నారు. విత్తనశుద్ధి మందులను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం అన్నదాతా సుఖీభవ కింద పెట్టుబడి సాయం రూ.20 వేలు ఒకేసారి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 90 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేయాలని ఈ నెల 26న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా నాయకుడు వీకేకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ధర్మాచరణతోనే ఉత్తమ సమాజం



సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో శృంగేరి మఠం ఉత్తరాధికారి



ధర్మప్రచారంలో భాగంగా భక్తుల ఇంట విధుశేఖర తీర్థులు

అనంతపురం కల్చరల్: ధర్మాచరణతోనే ఉత్తమ సమాజం ఏర్పడుతుందని శృంగేరీ మఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీతీర్థులు స్వామీజీ ఉద్బోధించారు. హైందవ ధర్మ ప్రచార యాత్రలో భాగంగా వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తున్న విధుశేఖర భారతీ తీర్థులు స్వామీజీ శుక్రవారం అనంతపురంలోని శంకర మఠంలో శారదా ఆది శంకరుల సమేత చంద్రమౌళీశ్వర పూజలు నిర్వహించారు. అనంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్న సాయిట్రస్టు విజయ్‌కుమార్ స్వామీజీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా స్వామీజీ పలువురు భక్తుల ఇంట ప్రత్యేక పూజలు చేశారు. భక్తిమార్గంలో నడవడం ద్వారా మనతో పాటు సమాజాన్ని ధర్మమార్గంలో నడిపించగల్గుతామన్నారు. మొదటిరోడ్డు శ్రీకాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం అనువంశీకులు హోసూరు రామసుబ్రమణ్యం, శంకర మఠం మేనేజర్ సత్యప్రసాద్ తదితరులు స్వామీజీని పంపనూరు వరకు వెళ్లి వీడ్కోలు పలికారు. స్వామీజీ కర్ణాటక రాష్ట్రం దావణగెరెకు బయల్దేరి వెళ్లారు.

సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో విధుశేఖర భారతి

ఆత్మకూరు: శృంగేరి శారదాపీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీ తీర్థ శుక్రవారం మండలంలోని పంపనూరు గ్రామంలో వెలసిన సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సేవలో గడిపారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆయనకు సిబ్బంది, దేవదాయశాఖ అధికారులు ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. అనంతరం విధుశేఖర భారతీ తీర్థ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం భక్తులను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు దేవదాయ శాఖ ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస ప్రసాద్, ఆలయ ఈఓ బాబు, అర్చకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కేశవరెడ్డి (73) సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అనంతపురం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు..కర్నాటక రాష్ట్రం చెళ్లికెర తాలూకాకు చెందిన కేశవరెడ్డి అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి సమీపంలో ఉన్న ఓ బోర్‌వెల్ సంస్థలో పని చేస్తున్నాడు. గురువారం రాత్రి సంస్థ కార్యాలయం నుంచి గోడౌన్‌కు కేశవరెడ్డితో పాటు మరొక వ్యక్తి బైకులో బయలుదేరారు. సర్వీస్ రోడ్డులో ఎదురుగా వస్తున్న మరొక బైకును ఢీ కొట్టారు. కేశవరెడ్డికి బలమైన గాయాలు కావడంతో హుటాహుటిన సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.



రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉంచిన వరిగడ్డి ట్రాక్టర్లు

ఇరువైపులా ట్రాక్టర్లు.. రోడ్డు కనిపించేదెలా!

ఆత్మకూరు: వరి కోతలు ముగియడంతో కణేకల్లు, బొమ్మనహాల్ మండలాల నుంచి పెద్ద ఎత్తున వరిగడ్డిని ట్రాక్టర్లలో తీసుకువచ్చి ఆత్మకూరులో విక్రయిస్తున్నారు. అయితే ఇలా వరిగడ్డిలోడుతో వచ్చిన ట్రాక్టర్లన్నీ స్థానిక కెనరా బ్యాంక్ పక్కన రోడ్డుకు ఇరువైపులా నిలపడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరిగడ్డి ట్రాక్టర్లు వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ప్రస్తుతం బ్యాంకులో పంట రుణాల రెన్యూవల్ జరుగుతుండటంతో రైతులు, ఖాతాదారులు పెద్ద ఎత్తున బ్యాంకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏదైనా ప్రమాదం చోటుచేసుకోకముందే పోలీసులు స్పందించి వరిగడ్డి ట్రాక్టర్లు రోడ్డుకు అడ్డంగా నిలపకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

30 వరకు సమైక్యతా యాత్ర



సమైక్యతా యాత్ర కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: ఉగ్రవాద వ్యతిరేక పోరాటమా..? అమెరికాకు లొంగుబాటా..? మత సామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణ అంశాలపై ఈ నెల 30 వరకు సమైక్యతా యాత్ర నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ తెలిపారు. శుక్రవారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో సమైక్యతా యాత్ర కరపత్రాలను సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, ఇతర నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. రాంభూపాల్ మాట్లాడుతూ పెహల్గామ్ దాడి ద్వారా ఉగ్రవాదులు దేశంలో మతపరమైన విభజన తీసుకురావాలని, మత విద్వేషాలు రెచ్చగొట్టాలని పథకం వేశారన్నారు. అయితే దేశ ప్రజలు సమైక్యంగా నిలబడి దాన్ని వమ్ము చేశారన్నారు. ఇక పాక్ ప్రేరేపిత ఉగ్రవాద చర్యలకు వ్యతిరేకంగా 'ఆపరేషన్ సిందూర్'ను భారత ప్రభుత్వం అమలు చేసిందన్నారు. కానీ కొన్ని శక్తులు ఉగ్రవాదానికి, మతంతో ముడివేసి ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నాయన్నారు. ఇలాంటి శక్తులకు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమైక్యతా యాత్రలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర కుమార్, బాలరంగయ్య, రామిరెడ్డి, వెంకటనారాయణ, ముత్తుజా పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు అరికట్టాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: మాతాశిశు మరణాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, గర్భిణులు, బాలింతలకు అందే సేవల్లో నిర్లక్ష్యం కన్పిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి పేర్కొన్నారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గత నెలలో జరిగిన మాతాశిశు మరణాలపై డీఎంహెచ్‌ఓ సంబంధిత వైద్యాధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వైద్యాధికారులు, సిబ్బంది తీరుపై డీఎంహెచ్‌ఓ అసహనం వ్యక్తం చేశారు. ప్రతి గర్భిణిని 12 వారాలలోపు రిజిస్ట్రేషన్ చేసుకుని, ఆమెకు అన్ని రకాల వైద్య పరీక్షలు, సేవలందించాలన్నారు. హైరిస్క్ కేసుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ యుగంధర్, సర్వజనాస్పత్రి అనస్తీషియా హెచ్‌ఓడీ డాక్టర్ నవీన్‌కుమార్, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శంకర్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులు వేగవంతం చేయండి

ఆత్మకూరు: పీఏబీఆర్ నుంచి ఆత్మకూరు మండలం, అనంతపురం రూరల్ మండలంలోని పలు గ్రామాలకు నీరు అందించేందుకు ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్ పనులను శుక్రవారం ఎమ్మెల్యే పరిటాల సునీత వడ్డుపల్లి వద్ద పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

హోరాహోరీగా బండ లాగుడు పోటీలు



పోటీల్లో బండను లాగుతున్న వృషభాలు

పెద్దవడుగూరు: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆవులాంపల్లిలో శుక్రవారం అంతర్ రాష్ట్ర ఒంగోలు జాతి వృషభాల బండ లాగుడు పోటీలను ఎస్ఐ ఆంజనేయులు ప్రారంభించారు. మొదటి రోజు ఆరుపళ్ల విభాగంలో వృషభాలు పోటాపోటీగా బండను లాగాయి. డీపీఆర్ బుల్స్ మొదటి బహుమతి రూ.50 వేలు, ఆర్.కే బుల్స్‌కు రెండవ బహుమతి రూ.40 వేలు, నంద్యాల గుండం చెన్నారెడ్డి వృషభాలకు మూడవ బహుమతి రూ.35 వేలు, మేకల భానుజ, జయచంద్రారెడ్డి వృషభాలకు నాల్గవ బహుమతి రూ.30 వేలు, ముసాని చంద్రశేఖర్ వృషభాలకు ఐదవ బహుమతి రూ.25 వేలు, కట్టల అరవింద్, మేకల సరోజమ్మ వృషభాలకు ఆరవ బహుమతి రూ.20 వేలు, డబ్బా అంకిరెడ్డి వృషభాలకు ఏడవ బహుమతి రూ.15 వేలు, కాందాపురం సుధాకర్ చిన్నవడుగూరు వృషభాలకు ఎనిమిదవ బహుమతి రూ.10 వేలు, రాజగోపాల్, జేసీబీ కార్తిక్ వృషభాలకు తొమ్మిదవ బహుమతి రూ.9 వేలు, అయ్యవారిపల్లి వెంకటేశ్వరెడ్డి, సాత్విక్‌రామ్ వృషభాలకు పదో బహుమతి కింద రూ.8 వేలు అందజేశారు.



రామచంద్రనగర్ మెయిన్ రోడ్డులో..



సంగమేష్ రోడ్డు మధ్యలో..



జేఎన్‌టీయూ కాలేజీ రోడ్డులో..

రోడ్లపైనే పశువులు..తరచూ ప్రమాదాలు

నగరంలో ఎటుచూసినా పశువులే కన్పిస్తున్నాయి. వీధుల్లోనే కాదు..ప్రధాన రోడ్లపై సైతం హల్‌చల్ చేస్తున్నాయి. పగలూ రాత్రి తేడా లేకుండా వాహనదారులకు అడ్డొస్తున్నాయి. ఈ క్రమంలో అక్కడక్కడ ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నా.. నగర పాలక సంస్థ అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదు. వాటిని అలాగే వదిలేస్తే రానురాను నగర రోడ్లపై వెళ్లడం కష్టమేనని వాహనదారులు అంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం